క్లుప్తంగా

నేడు వాల్మీకుల సమావేశం

శాంతినగర్ : అలంపూర్ చౌరస్తాలోని మార్కెట్ యార్డులో ఆదివారం వాల్మీకుల తాలూకాస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం తాలూకా ప్రధాన కార్యదర్శి పైపాడు వెంకటేశ్వర్లు ప్రకటనలో తెలిపారు. ఎస్టీ రిజర్వేషన్ సాధన, బీసీబంధులో వాల్మీకులను చేర్చడం, కమ్యూనిటీహాళ్ల నిర్మాణం తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి వాల్మీకులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

శాంతినగర్‌లో చిరుజల్లులు

శాంతినగర్ : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం చిరుజల్లులు కురిశాయి. కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంట పొలాల్లో విత్తనాలు విత్తిన రైతులు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం ఆకాశం మేఘావృతం కావడంతో భారీ వర్షం కురుస్తుందని ఆశించారు. ఆయా గ్రామాల్లో చిరుజల్లులు మాత్రమే కురవడంతో నిరాశకు గురయ్యారు.

పిల్లలను బడుల్లో చేర్పించాలి

కేటీదొడ్డి: బడిబయటి పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని హెచ్‌ఎం స్వాతి అన్నారు. మండలంలోని పాగుంట పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి మెరుగైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. బాలలను పనుల్లో పెట్టుకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్వేత, నాయిమా, రాకేష్, సీఆర్‌పీ యుగంధర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శని త్రయోదశి పూజలు

శాంతినగర్: శని త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని పలు ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. శనైశ్చరస్వామికి నువ్వుల నూనెతో తైలాభిషేకం నిర్వహించి నల్ల వస్త్రాలు, నీలం పుష్పాలు, నారికేళాలు, నల్లద్రాక్ష పండ్లు సమర్పించి పూజలు చేశారు.

ఆలయానికి బంగారం వితరణ



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం కొండపై వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం గద్వాల డీఎస్పీ రంగస్వామి సతీమణి కృష్ణకుమారి తులం బంగారం వితరణం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, పద్మారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన భాగవత సప్తాహం



ధరూరు: మండలంలోని కోతులగిద్ద అరణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద వారం రోజులుగా నిర్వహిస్తున్న భాగవత సప్తాహం శనివారం ముగిసింది. వారంరోజులపాటు జరిగిన కార్యక్రమానికి పలు ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరైనట్లు ఆలయ కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు నర్సింహులు, సతీష్, ఈశ్వరయ్య, వెంకటేశ్వరరెడ్డి, సత్యన్న, రంగన్న, రాములు, రంగప్ప పాల్గొన్నారు.

ఘనంగా బోనాల వేడుక



ధరూరు : మండలంలోని పీజేపీ క్యాంపు వద్ద ఉన్న జెన్‌కో డీఏవీ పాఠశాలలో శనివారం బోనాల సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పూలతో అలంకరించిన బోనాలతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా పండుగ విశిష్టతను పాఠశాల చైర్మన్ రామసుబ్బారెడ్డి వివరించారు. కార్యక్రమంలో డీఏవీ విద్యాసంస్థల ఏఆర్ఓ జీఆర్‌కే ప్రసాద్, హెచ్‌ఎం యాదవరెడ్డి పాల్గొన్నారు.

‘ఉపాధి’ కరువు

- పనులు లేక కూలీల అవస్థలు
- వర్షాభావంతో అంతంతమాత్రంగా వ్యవసాయ పనులు
- ఉపాధి హామీ పనుల కల్పనపై అధికారుల నిర్లక్ష్యం
- కూలీ కోసం ఇతర గ్రామాలకు పయనం



రాజోళి నుంచి ఇతర గ్రామాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న కూలీలు

రాజోళి: పని చేస్తేనే పూట గడిచే కూలీల పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఒకవైపు వ్యవసాయ పనులు లభించక.. మరోవైపు ఉపాధి హామీ పథకం పనులు లేక అవస్థలు పడుతున్నారు. కూలీ పనుల కోసం ఇతర గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో నెలరోజులుగా కూలీలకు పనులు దొరకడంలేదు. వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ పనులు అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. కేవలం బోరుబావుల కింద మాత్రమే పంటల సాగు చేపడుతున్నారు. దీంతో గ్రామంలో ఉన్న కూలీలందరికీ పనులు దొరకడంలేదు. మరోవైపు ఉపాధి హామీ పనులు ఇటీవల నిలిచిపోయాయి. పనులు కల్పించాలని కూలీలు అధికారులను అడిగినా ఫలితం లేకుండాపోతోంది. దీంతో కూలీ పనుల కోసం ఇతర గ్రామాలకు వెళ్తున్నారు. స్వగ్రామంలోనే కూలీ పనులు లభిస్తే సాయంత్రం వరకు ఇంటికి వస్తామని, ఇతర గ్రామాలకు వెళ్లడంతో వచ్చేలోగా రాత్రి అవుతోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటోల్లో ఇతర గ్రామాలకు వెళ్లినా కూలి నామమాత్రంగానే ఇస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని కోరుతున్నారు.

ఇతర గ్రామాలకు వెళ్తున్నాం



గ్రామంలో ఉపాధి హామీ పనులు లేకపోవడంతో కూలీకి ఇతర గ్రామాలకు వెళ్తున్నాం. ఉదయం వెళ్లి రాత్రి వరకు పనులు చేస్తున్నా సరైన కూలి రావడంలేదు. దీనికితోడు ఇంటికి వచ్చే వరకు ఆలస్యం అవుతుండడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు.

– ఎలిజబెత్తమ్మ, రాజోళి

అధికారులు స్పందించడంలేదు..



ఉపాధి హామీ పనులు కల్పించాలని అధికారులకు ఎన్ని మార్లు విన్నవించినా ప్రయోజనం ఉండడంలేదు. స్థానికంగా పనులు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర గ్రామాలకు వెళ్లక తప్పడంలేదు. ఆటోల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కూలీ పనులకు వెళ్తున్నారు. ఉపాధి హామీ పనులు కల్పించకపోతే కూలీలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి ఉపాధి హామీ పనులను ప్రారంభించాలి.

– విజయ్‌కుమార్, సీపీఎం నాయకుడు, రాజోళి

పనులు కల్పిస్తాం..

ఉపాధి హామీలో టెక్నికల్ సమస్య వల్ల కొన్ని చోట్ల పనులు కల్పించలేకపోయాం. దానికి తోడు కూలీలు కూడా ప్రత్యేకించి కొన్ని పనులు అడుగుతున్నారు. వాటిని కేటాయించడంలో జాప్యం జరిగి ఉంటుంది. వీలైనంత త్వరగా పనులు కల్పిస్తాం.

– గోవిందురావు, ఎంపీడీఓ, రాజోళి

ఇరువర్గాలపై కేసు నమోదు

ఎర్రవల్లిచౌరస్తా: పొలం తగాదాలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇటిక్యాల ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన అన్నదమ్ముళ్లు బలరాముడు, బీసన్న, రవి, రాఘవేంద్ర శనివారం గ్రామ పెద్దలతో కలిసి భూతగాదా పరిష్కారం కోసం తమ పొలానికి వెళ్లారు. ఈ క్రమంలో గ్రామ పెద్దల సమక్షంలో పొలం సమస్య తీరకపోవడంతో ఒకరిపై ఒకరు ఆగ్రహానికి దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో పలువురికి రక్త గాయాలు కావడంతో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మహిళపై దాడి

ధరూరు : పొలం గెట్టుపై ఉన్న చెట్టు నరికివేతను అడ్డుకున్న మహిళా రైతుపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. మండలంలోని యములోనిపల్లికి చెందిన వెంకటేష్, రేవులపల్లికి చెందిన మహిళా రైతు సుమిత్ర పంట పొలాలు పక్కపక్కనే ఉంటాయి. గెట్టుపై ఉన్న చెట్టును వెంకటేష్ నరికివేస్తుండగా, మా చెట్టును నువ్వెలా నరుకుతావంటూ సుమిత్ర అడ్డుగా వెళ్లడంతో దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం: కేసునమోదు

ధరూరు : చదువుకునేందుకు పాఠశాలకు వెళ్లిన ఓ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని వామన్‌పల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని వామన్‌పల్లికి చెందిన కోలుబావి సుమతి 14ఏళ్ల బాలిక మండల పరిధిలోని ఉప్పేరు ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. పదిరోజుల క్రితం ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్లిన సుమతి పాఠశాల నుంచి ఇంటికి బయలు దేరి అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గ్రామాలు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బాలిక తండ్రి బోయ హన్మంతు రేవులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎక్కడైనా ఆచూకీ లభిస్తే 8712670293, 8712670298నంబర్లకు సమాచారమివ్వాలని ఎస్‌ఐ శివానందం గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గద్వాల క్రైం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన గద్వాల మండలంలో శనివారం చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల మేరకు.. బస్రాల్‌చెరువు గ్రామానికి చెందిన యేసురత్నం బైక్‌పై ఎర్రవల్లి వైపు వెళుతూ ట్రాక్టర్‌ను క్రాస్ చేసే క్రమంలో వెనుక నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు

మానవపాడు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దని ఎస్‌ఐ కె. రాము తెలిపారు. మండలంలోని చెన్నిపాడు, మానవపాడు, అమరవాయి శివారు ప్రాంతాల్లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎస్‌ఐకి సన్మానం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కోదండాపురం పీఎస్ నూతన ఎస్‌ఐ కృష్ణదేవను శనివారం పల్లెపాడుకు గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సత్యారెడ్డి, శాంతన్న, మాజీ సర్పంచ్ సత్యారెడ్డి, రజాక్, మధు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



బీటీరోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

శాంతినగర్: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. వడ్డేపల్లి మండలంలోని జక్కిరెడ్డిపల్లి–జూలెకల్ బీటీరోడ్డు నిర్మాణ పనులకు శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1.8 కిలోమీటర్ల మేర బీటీరోడ్డు నిర్మాణానికి రూ.90లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతి గ్రామానికి బీటీరోడ్డు నిర్మించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలోనే పురోగతి



దేశాభివృద్ధిని వివరిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: బీజేపీ పాలనలోనే దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని డాక్టర్లు, న్యాయవాదులు, టీచర్లు, వ్యాపారులను బీజేపీ నాయకులు కలిసి దేశంలో బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని వివరించారు. అనంతరం పుస్తకాలను పంపిణీ చేశారు. ఈనెల 31 వరకు దేశవ్యాప్తంగా మేధావులను కలిసే కార్యక్రమం చేపట్టినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు తెలిపారు. కార్యక్రమంలో అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ మెడికల్ తిరుమల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నర్సింహయ్యశెట్టి, జిల్లా కార్యవర్గ సభ్యుడు భీమసేనరావు, ఓబీసీ ఉపాధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

వరుణదేవా.. కరుణించవా



జల్లాపురంలో ఎద్దులబండ్లపై కృష్ణాజలాలు తీసుకొస్తున్న రైతులు



గోకులపాడులో కప్పమమ్మను ఊరేగిస్తున్న గ్రామస్తులు

మానవపాడు: వరుణుడి కరుణ కోసం శనివారం పలు గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోకులపాడులో కప్పమమ్మతో ఊరేగింపు నిర్వహించారు. జల్లాపురంలో రైతులు 41 ఎద్దులబండ్లతో ఊరేగింపుగా కృష్ణాజలం తీసుకొచ్చి గ్రామదేవలకు అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహులు, ఎల్‌ఐసీ నర్సింహులు విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌డీడీపై అవగాహన



ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి ప్రసూణరాణి

అలంపూర్ రూరల్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై శనివారం క్యాతూర్ పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి ప్రసూణరాణి, ఆరోగ్య విస్తర్ణాధికారి లక్ష్మీకాంత్ మాట్లాడుతూ 20వ తేదీన నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పిల్లలందరికీ ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా కార్యక్రమం నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ లీలమ్మ, సిబ్బంది అక్కమ్మ, బాలీశ్వరయ్యశెట్టి, మల్లమ్మ, శ్యామలదేవి పాల్గొన్నారు.

మానవపాడు: పిల్లల్లో నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని డాక్టర్ రిజ్వానా తాన్విర్, ఎంపీడీఓ రమణారావు సూచించారు. శనివారం మండలకేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. 1నుంచి 2 సంవత్సరాల వారికి సగం మాత్ర, 2నుంచి 19 సంవత్సరాల వారికి ఒక మాత్ర ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రామకృష్ణ, చంద్రన్న, సంధ్యారాణి, తిరుమల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానాను అందుబాటులోకి తేవాలి



షాదీఖానా పనులను పరిశీలిస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని బీడీకాలనీలో నిర్మిస్తున్న షాదీఖానా పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎంఐఎం నాయకులు కోరారు. శనివారం షాదీఖానా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షాదీఖానా లేకపోవడంతో ముస్లింలు ప్రైవేటు ఫంక్షన్‌హాళ్లను అద్దెకు తీసుకొని ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు అల్తాఫ్ హుస్సేన్, రఫీ, సమీ, సలీం బేగ్, అంజద్ పాల్గొన్నారు.

కొనసాగిన కార్మికుల సమ్మె



అలంపూర్‌లో నిరసన తెలుపుతున్న కార్మికులు

సాక్షి నెట్‌వర్క్ : పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. తమ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల సమ్మెకు పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

బాలల హక్కులను పరిరక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

రాజోళి: బాలల హక్కుల పరిరక్షణకు యువత కృషి చేయాలని తహసీల్దార్ జోషి శ్రీనివాసశర్మ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన సంఘాల సమావేశానికి హాజరై మాట్లాడారు. బాలకార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలను అరికట్టాలని సూచించారు. గ్రామాల్లో అక్షరాస్యత శాతం పెంచేందుకు యువజన సంఘాలు నడుం బిగించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ మండల ఇంచార్జ్ హన్మిరెడ్డి, దీరజ్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులను ఆదుకోవాలి



బోయలగూడెంలో రైతులతో మాట్లాడుతున్న నర్సింహ

గట్టు : ఎర్ర తెగులు సోకి నష్టపోయిన సీడ్ పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకుడు వీవీ నర్సింహ డిమాండ్ చేశారు. మండలంలోని బోయలగూడెం, ఇందువాసి, బల్గెర, మాచర్ల గ్రామాల్లో సీడ్ పత్తిని సాగు చేసి నష్టపోయిన రైతులను శనివారం కలిశారు. సీడ్ పత్తి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి ధర్నాలో పాల్గొనాలని కోరారు.

కళాకారులకు అండగా ఉంటాం



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఉండవెల్లి: మండలంలోని రంగస్థల కళాకారులకు అండగా ఉంటామని సీపీఎం, సీపీఐ, బీఎస్పీ నాయకులు తెలిపారు. అలంపూర్ చౌరస్తాలో రంగస్థల కళాకారులకు కేటాయించిన స్థలాన్ని శనివారం హౌసింగ్‌బోర్డు అధికారులు స్వాధీనం చేసుకోవడంపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంగస్థల కళాకారుల స్థలాన్ని స్వాధీనం చేయడంతోపాటు పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం బాధాకరమన్నారు. కళాకారులకు స్థలాలను అప్పగించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవదాసు, ఈదన్న, మద్దిలేటి, ప్రభుదాసు, మణికుమార్, తిరుపాల్, శివారెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేయాలి

గద్వాల అర్బన్: బీసీ కులవృత్తిదారులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థికసాయం వెంటనే అందజేయాలని బహుజన సేన జిల్లా అధ్యక్షుడు దానయ్య శనివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా బీసీలు సుమారు 30వేల మంది దరఖాస్తు చేసుకోగా. కేవలం రూ.కోటి మాత్రమే విడుదల చేయడం బాధాకరమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆర్థికసాయం అందించి కులవృత్తులను ప్రోత్సహించాలని కోరారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

మానవపాడు: ఉపాధి హామీ పథకం పనులపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ రమణారావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హరితహారం కార్యక్రమంలో గ్రామపంచాయతీలకు నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చెత్త సేకరణ చేపట్టాలని తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

నేడు బహిరంగ సభ

గద్వాల అర్బన్: పాత పెన్షన్ సాధనకై ఆదివారం) జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో ఉదయం 11గంటలకు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత పెన్షన్ సాధనకు ఆదివారం నుంచి సంకల్ప రథయాత్ర ప్రారంభం కానున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారుల మీదుగా ర్యాలీ నిర్వహించిన అనంతరం బహిరంగ సభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని కోరారు. సమావేశంలో విష్ణు, శ్రీనివాస్ రెడ్డి, బుచ్చన్న, లక్ష్మీనారాయణ, ఎల్లస్వామి, నాగేష్ ఉన్నారు.

పెంచిన వేతనాలు చెల్లించండి

అయిజ: మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ అన్నారు. శనివారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఎమ్మార్సీ భవనంలో ఇంచార్జ్ ఎంఈఓ నర్సింహకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ 2022 మార్చి 15న అసెంబ్లీ సాక్షిగా మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.2వేలకు గౌరవ వేతనం పెంచుతున్నట్లు ప్రకటించారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ మేరకు పెంచిన వేతనం ఇవ్వడంతో పాటు పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లేషమ్మ, లక్ష్మి, శేషమ్మ, పద్మమ్మ, వీరేషమ్మ, ఈరమ్మ, దేవమ్మ పాల్గొన్నారు.

పెద్దఎత్తున మొక్కలు నాటాలి

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి సూచించారు. డి.బుడిదపాడు గ్రామశివారులో శనివారం గుంతలను తవ్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అలంపూర్ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించాలని ఫీల్డ్‌అసిస్టెంట్‌కు సూచించారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ విజయ్‌శంకర్ ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

అయిజ: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఇంచార్జ్ ఎంఈఓ నర్సింహ అన్నారు. శనివారం పట్టణంలోని అక్షర, చైతన్య పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల వివరాలను తెలుసుకున్నారు. అదేవిధంగా మౌలిక వసతులను గమనించారు. విద్యార్థుల నుంచి తీసుకుంటున్న ఫీజులపై ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే పాఠశాలల అనుమతులను రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్‌పై ప్రజావేదిక

అయిజ: ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు సంబంధించి 10 రోజులుగా సామాజిక తనిఖీ నిర్వహించిన అధికారులు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక ఏర్పాటు చేశారు. ఎస్‌ఆర్‌పీ స్వామి, డీఆర్డీఓ ఉమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావేదికలో 2021 ఆగస్టు 1నుంచి 2023 మార్చి 31వరకు రూ.7కోట్లతో చేపట్టిన పనుల వివరాలపై చర్చించారు. సోషల్ ఆడిట్ పూర్తి వివరాలను ఆదివారం వెల్లడిస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసులు, ఎంపీడీఓ సాయిప్రకాష్, ఏపీఓ శరత్‌బాబు పాల్గొన్నారు.

రథయాత్రను విజయవంతం చేయండి

మానవపాడు: పాతపెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞా ఆధ్వర్యంలో చేపట్టిన సంకల్ప రథయాత్రలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం భోజన విరామ సమయంలో సోషల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించి సంకల్ప రథయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, అలంపూర్ మండల ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్, పీఆర్టీయూ అధ్యక్షుడు లక్ష్మణ్, నాగరాజు, శ్రీహరి, భాస్కర్‌రెడ్డి, శ్యాలమ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 90100 76222
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 90100 68317
జోగుళాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com